క్లుప్తంగా

నేడు ప్రభుత్వ పాఠశాలకు సెలవు

పిడుగురాళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని మన్నె పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు ఎన్నికల బూత్‌లను ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

పిడుగురాళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పులగర శోభనబాబు బుధవారం కోరారు. ఉదయాన్నే ఓటు వేసేందుకు ప్రయత్నించాలని, లేనిపక్షంలో దొంగ ఓట్లు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఓటు వేసే ముందు పోలింగ్ అధికారుల సూచనలు, సలహాల పాటించాలని ఆయన సూచించారు.

వైభవంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



పిడుగురాళ్ల: మండలంలోని కోనంకిలో గల సాయిబాబా మందిరం 7వ వార్షికోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అందరి ఆరాధ్య దైవం సాయిబాబా అని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, గ్రామ పెద్దలు కలిసి అశోక్‌కుమార్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి మూల నక్షత్రం పురస్కరించుకుని కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు స్వామిని ప్రత్యేకలంగా అలంకరించి, పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ, కల్యాణ నిర్వహణ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మహాశివుడికి వెండి నాగాభరణం సమర్పణ

యడ్లపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాశివునికి వెండి నాగాభరణాన్ని భక్తులు సమర్పించారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కాలంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలో దూరి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. దీంతో గ్రామానికి చెందిన బళల హరినారాయణ, సీతారావమ్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఆలయ ధర్మకర్త సాంబశివరావుకు సమర్పించారు. వెంటనే స్వామివారికి వాటిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు సీతారావమ్మ, కుమారుడు, కోడలు బళల వెంకటేశ్వరరావు, పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్వారీ స్థలం చుట్టూ ఫెన్సింగ్

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్‌కు చెందిన క్వారీ స్థలం చుట్టూ గ్రామ పంచాయతీ అధికారులు ఫెన్సింగ్ వేశారు. ఈ స్థలంలో స్థానికంగా ఉన్న కంపెనీల వ్యర్థాలు, ఇళ్ల వ్యర్థాలు పడవేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. అంతేకాక వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ రహదారిపై వ్యాపించి వాహనచోదకులకు దారి కనిపించక సమస్యగా మారింది. పొగ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసన, పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నామంటూ సీఆర్ కళాశాల విద్యార్థులు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయటంతో పాటూ వ్యర్థాలను పడవేసే వారిపై చర్యలు తీసుకుంటామని బోర్డును ఏర్పాటు చేశారు.

విద్యుత్ వైరు తెగిపడి పొలంలో జొన్నపంట దగ్ధం

10 ఎకరాల్లో రూ.5 లక్షల నష్టం

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన రైతు దుగ్గెంపూడి రామాంజినేయులకు చెందిన జొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై రూ.5 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాలు మేరకు కనమర్లపూడి గ్రామం పెదకంచర్ల కాల్వ పరిధిలోని 12 ఎకరాలు కౌలుకు తీసుకొని గడ్డి జొన్న పంట సాగు చేశాడు. వారం రోజుల వ్యవధిలో చేతికివచ్చే సమయానికి విద్యుత్ వైరు పొలంలో తెగిపడి పంట సుమారు 10 ఎకరాల్లో తగలబడింది. ఈ క్రమంలో పొలంలో జొన్న పంట అంతా కాలిపోయింది.

హరహర మహాదేవ.. శంభో శంకర

- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో కిటకిట



స్వామి సన్నిధిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు

గురజాల : మహా శివరాత్రి పురస్కరించుకుని హరహర మహాదేవా...శంభో శంకర అంటూ శివ నామస్మరణతో శైవక్షేత్రాలు బుధవారం మార్మోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని అమరలింగేశ్వరస్వామి, ముక్కంటేశ్వరస్వామి, వీరభద్రస్వామి, శ్రీ గంగా పార్వతీ సమేత ఇష్టకామేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగమహేశ్వరపురంలోని కొనేరు దగ్గరున్న శివాలయంలో భక్తులు బారులుతీరారు.

పోటెత్తిన అమరలింగేశ్వరస్వామి దేవాలయం

మండల పరిధిలోని దైదలో కృష్ణానది తీరాన గల శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే కృష్ణానదిలో స్నానమాచరించి, బిలంలోని అమరలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాకారానికి అభిషేకాలు జరిపారు. గోగులపాడులోని శ్రీ గంగా పార్వతి నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. గోగులపాడులోని శివాలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. సీఐ ఆవుల భాస్కర్ నేతృత్వంలో ఎస్ఐ వై. వినోద్ కుమార్, సిబ్బంది భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. దైద, గోగులపాడులో దేవాలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు జాగారం చేసేందుకు వసతులను కల్పించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణచంద్రరావు ఏర్పాట్లను పరిశీలించారు.

ఎమ్మెల్యే యరపతినేని పూజలు

దైదలోని శ్రీ అమరలింగేశ్వర స్వామి, గోగులపాడులోని శ్రీనీలకంఠేశ్వరస్వామిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అందించిన ఏర్పాట్ల గురించి అధికారులను ఆరా తీశారు. ఆయన వెంట యరపతినేని నిఖిల్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, ఎస్. బొల్లయ్య, నవులూరి శ్రీరాం మూర్తి, శరమాళ్ల హనుమంతురావు ఉన్నారు.

మారుమోగిన శివ నామస్మరణ

వెల్దుర్తి: మండలంలోని శివాలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. గొట్టిపాళ్లలోని శ్రీ భక్తమార్కండేయస్వామి ఆలయంలో అర్చకులు జిగురు శంకరశర్మ, గుండ్లపాడులో ఉన్న ఉమామహేశ్వరాలయంలో వెల్లంకి సుబ్రహ్మణ్యశర్మ, శిరిగిరిపాడు శివాలయంలో యండపల్లి సుబ్బారావు, ఉప్పలపాడులో బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో మేడిపల్లి నర్సింహయ్యమూర్తి స్వామికి తెల్లవారుజామునే అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు శివాలయాలలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. గొట్టిపాళ్లలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

కన్నుల పండువలా సారంగధరేశ్వరస్వామి తిరునాళ్ల

దాచేపల్లి : హర..హర మహాదేవా శంభోశంకర అంటూ భక్తులు స్వామి పాదాల వద్ద ప్రణమిల్లారు. దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారం సమీపంలో కొండపై కొలువైన శ్రీ సారంగధరేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం కన్నుల పండువలా జరిగింది. స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సారంగపల్లి అగ్రహారంతో పాటు మాదినపాడు, కొత్తూరు, దాచేపల్లి ఇతర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. పుణ్య దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేకంగా పూజలు చేశారు. శివ మాలధారులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు మహా అన్నదానం చేపట్టారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాన్, సొసైటీ చైర్మన్ బత్తుల లింగారెడ్డి, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నంద్యాల వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాచేపల్లి, నారాయణపురం, కేసానుపల్లి, తంగెడ, పొందుగల, రామాపురం, ముత్యాలంపాడు, పెదగార్లపాడు, శ్రీనగర్ గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

సత్రశాలలో ఎమ్మెల్యే జూలకంటి పూజలు

సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి పురస్కరించుకుని సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఈవో గాదె రామిరెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల మల్లిర్జునశర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర శిల్పకళాభివృద్ధి సంస్థ చైర్మన్ చేరెడ్డి మంజుల, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు సీహెచ్. అబ్బిరెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బోడపాటి రామకృష్ణ, పార్టీ మాజీ మండల అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు పులిహోరా, మజ్జిగ పంపిణీ

సత్రశాల శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పాలువాయి గ్రామస్తులు పులిహోర, చల్లని మజ్జిగను పంపిణీ చేసి సేవలుచేయడం ప్రశంసనీయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పాలువాయి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లం బ్రహ్మారెడ్డి, శ్యామల శ్రీనివాసరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, పాశం లచ్చిరెడ్డి, రామకోటిరెడ్డి, గొట్టం మల్లికార్జునరెడ్డి, పాశం మస్తాన్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో...

స్థానిక ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్నిఎస్ఈ వెంకటరమణ ప్రారంభించి మాట్లాడారు. పురాతన శైవక్షేత్రమైన సత్రశాల దేవస్థానంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు చల్లని మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో డాక్టర్ మధుబాబు, ప్రాజెక్టు ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ నాగరాజు, ఏడీఈలు రత్తయ్య, గిరిబాబు, మహ్మద్, ఏఈలు జయపాల్, మల్లేష్ పాల్గొన్నారు.

కంభంపాడులో వైభవంగా కల్యాణం

మాచర్ల రూరల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని కంభంపాడు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు జె. మురళి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. స్వామి స్వయంభువుగా శ్రీ బుగ్గమల్లేశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారని, ఆయన్ను పూజిస్తే అందరికీ మేలు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి

మాచర్ల: మహా శివరాత్రి పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని శైవ క్షేత్రాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పాత మాచర్లలోని శ్రీగంగా పార్వతి నగరేశ్వర సమేత, రామప్ప దేవాలయం, వీరభద్రస్వామి దేవాలయం, రింగ్ రోడ్డులోని బాలనాగేంద్ర స్వామి దేవాలయం, కస్తూర్బా పాఠశాల వెనుక బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు శైవ క్షేత్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు.

శివాలయంలో వైద్య శిబిరం

పిడుగురాళ్ల: మహా శివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయంలో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు శిబిరాన్ని ప్రారంభించారు. పండగను పురస్కరించుకొని వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. శిబిరంలో 250 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కె. మేఘమాల, వైద్య సిబ్బంది పి. బాబు పాల్గొన్నారు.

ధనమల్లయ్య కొండకు పోటెత్తిన భక్తులు

కారెంపూడి: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని అన్ని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఒప్పిచర్ల శివారు నల్లమల అడవిలో ఉన్న ధల్లయ్య స్వామిని వేలాదిగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులందరికీ మస్తులు అన్నదానం చేశారు. చింతపల్లిలో దొడ్డ మల్లేశ్వరస్వామిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. రాత్రంతా జాగారం చేసేందుకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సినీ సంగీత కచేరి, జబర్దస్త్ నటుల కార్యక్రమం, భరతనాట్య ప్రదర్శనలు భజనలు జరిగాయి. కారెంపూడిలో చారిత్రక ప్రసిద్ధి చెందిన సూరేశ్వరాలయం, నగరేశ్వర స్వామి ఆలయాలతో పాటు శివాలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని మిరియాల, పెదకొదమగుండ్ల గ్రామాలతో పాటు అన్ని శివాలయాలలో శివరాత్రి జాగరణలు జరిగాయి.

శ్రీ బోళా లింగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

పిడుగురాళ్ల: మహా శివరాత్రి పురస్కరించుకుని పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని సున్నపు బట్టీల వద్ద ఉన్న శ్రీ బోళా లింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు ఆలయ పూజారులు సంప్రదాయబద్ధంగా , మంత్రోచ్చరణల మధ్య ఘన స్వాగతం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రామకృష్ణ, ఆలయ ప్రధాన పూజారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రామప్ప దేవాలయంలో స్వామివారికి పూజలు



యాదవ బజారులోని శివాలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

త్రిపురాంతకేశ్వర స్వామికి పీఆర్కే ప్రత్యేక పూజలు

మాచర్ల: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా త్రిపురాంతకంలోని శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

శివనామ స్మరణతో హోరెత్తిన ఆలయాలు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల నుంచి కైలాసవాసుని దర్శించుకునేందుకు భక్తులు కోటప్పకొండ, దైద, సత్రశాల, అమరావతి పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. మండలంలోని మోర్జంపాడు శివారులోని శ్రీబుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయానికి కూడా భక్తులు తరలివచ్చారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు, వ్యాపార, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గ్రామస్తుల సహకారంతో మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే యరపతినేని పూజలు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా పాడిపంటలు, సుఖ, సంతోషాలతో చల్లగా కాపాడాలని స్వామిని వేడుకున్నారు.కర్పూరపు ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.



మోర్జంపాడులో శ్రీ బుగ్గ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



ఉప్పలపాడు శివాలయంలో పూజలు



స్వామి సన్నిధిలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి దంపతులు



కంభంపాడులోని శివాలయంలో కల్యాణ మహోత్సవం



ధనమల్లయ్య స్వామి కొండ వద్ద భక్తుల సందడి



దైద అమరలింగేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



మందులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బారావు



సారంగధరేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎస్ఈ వెంకటరమణ

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నేడు పోలింగ్

- గురజాల నియోజకవర్గంలో 6,829, మాచర్ల నియోజకవర్గంలో 7,239 మంది ఓటర్లు
- రెండు చోట్లా 18 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

గురజాల/మాచర్ల రూరల్ : కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార హోరు ముగిసింది. గురువారం జరిగే పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయింది.

రెవెన్యూ డివిజన్‌లో వివరాలు ఇలా...

గురజాల డివిజన్‌లోని గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మాచర్ల నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. రెండింటి పరిధిలో 14,068 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. కేంద్రాల వద్ద అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు, మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.90 మందికి పైగా సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఓట్ల వేటలో కూటమి నేతలు

పోటీలో ఉన్న తమ అభ్యర్థుల విజయం కోసం కూటమి నేతలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం యూటీఎఫ్ నాయకులు కూడా తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. ఓట్లు వేయమని పట్టభద్రులను అభ్యర్థిస్తున్నారు.



గురజాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం చేసిన పోలింగ్ బూత్‌లు

ఓటుహక్కుని సద్వినియోగం చేసుకోవాలి

రెంటచింతల:గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మూఢావత్ అర్జున్ నాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ 323ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 25న ప్రిసైడింగ్ ఆఫసర్లకు ఎన్నికల మెటీరియల్ అందజేశామని చెప్పారు. మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 833 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.



మాచర్ల పట్టణంలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న పీఓ పాశం శ్రీనివాసరెడ్డి

మండలాల వారీగా వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు
గురజాల	2	1065	432	1497
దాచేపల్లి	2	1154	483	1637
మాచవరం	1	599	210	809
పిడుగురాళ్ల	3	1917	969	2886
మాచర్ల	6	2235	1164	3399
దుర్గి	1	746	239	985
వెల్దుర్తి	1	801	172	973
రెంటచింతల	1	550	280	830
కారంపూడి	1	733	319	1052
మొత్తం	18	9800	4268	14068

మున్సిపల్ ఎన్నికలకు పిడుగురాళ్లలో ఏర్పాట్లు

పిడుగురాళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పేర్కొన్నారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని పట్టభద్రుల కోసం మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 329 బూత్‌లో 520 మంది, 329/ఏ ఎన్నికల బూత్‌లో 515మంది, 330 నంబర్ బూత్‌లో 892 మంది, 331 నంబర్ బూత్‌లో 978మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. మొత్తం 2895 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన పేర్కొన్నారు.

సందడిగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం





సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. శరణ్య సపోర్టు నిర్వాహకులు రమాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. స్వామి అధ్యక్షత వహించారు. పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు వైహెచ్‌కే మోహన్ రావు, పాఠశాల నిర్వాహణ కమిటీ చైర్మన్ కె. శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు వెంకట శివరాం, మాజీ చైర్మన్ కె. రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, కె. నిర్మలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నూజెండ్ల: లక్ష్యాలను నిర్దేశించుకొని చదివితే ఉన్నత స్థాయికిచేరుకోవచ్చని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నూజెండ్లలో కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎంపీడీఓ పి.ఉమాదేవి, సీడీపీఓ ఎం.అనూరాధ, ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.